



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 19 | మార్చి | 2026 పేజీలు : 8


### అహంభావం తగ్గి.. ఆలోచన పెరిగితే...

# 'పరాభవ'ం లోనూ ప్రశంసే..!



## నేడు ఉగాది

### గతం తలచుకుని ఆందోళనలో కొందరు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పరాభవ నామ సంవత్సరం అనగానే కొందరిలో సంశయం వ్యక్తమవుతుంది. పంచాంగాలను నమ్ముతూ ఆధ్యాత్మికతలో ఉన్నవారు పరాభవ నామ సంవత్సరానికి సంబంధించి రక రకాల ఆలోచనలతో ఉన్నారు. పేరుతో పరాభవం ఉంది కాబట్టి ఏదో జరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అహంభావం తగ్గించుకుని ఆలోచన పెంచుకుని సహనంతో వ్యవహరించగలిగితే పరాభవ నామ సంవత్సరంలోనూ అద్భుత విజయాలు సాధించవచ్చు, ప్రశంసలు దక్కించుకోవచ్చు. కాకపోతే సహనం, ఓర్పు, పట్టుదల అవసరం. పరాభవం అంటే దుర్గుణాలను ఓడించడం, గర్వాన్ని పారద్రోలడమని ప్రవచకులు చెబుతున్నారు. పరాభవనానికి కారణం అహంకారమేనని దానిని వదిలితే అంత శుభమే జరుగుతుందని కూడా ప్రవచిస్తున్నారు. తెలుగు వారి పండుగల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పండుగ ఉగాది. ఇక్కడి నుంచి

మిగతా 2లో..

# రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం




- మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి
- రుణమాఫీ విషయంలో మాట తప్పిన సర్కార్
- ధరణికి నకలుగా మారిన భూ భారతి
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం
- కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతాంగ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని ఈ ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధోరణి మారకపోతే రైతుల

మిగతా 2లో..

### నేటి నుండి తిరుకళ్యాణ

## బ్రహ్మోత్సవాలు

- కొనసాగుతున్న శ్రీరామ నవమి ఏర్పాట్లు
- పట్టణంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు
- 27న శ్రీరామ నవమి, 28న పట్టాభిషేకం
- ముఖ్యమంత్రి, గవర్నర్ రాక
- భక్తులకోసం సకల సౌకర్యాలు

7లో..

## నాడు మన తాతయ్యల కట్టు.. నేడు వేడుకల్లోనే పంచెకట్టు..!

- నానాటికీ మటు మాయమైపోతున్న పంచెకట్టు సంప్రదాయం
- ఈ రోజుల్లో కోటికొక్కరుగా మిగులుతున్న పంచెకట్టు పెద్దలు
- షాట్లు, లోయర్ల మోజులో 'కట్టు' విడుస్తున్న నేటి తరం

సెంటర్‌స్ప్రెడ్

## ఎండకాలంలోనూ నిండుగా నీళ్లు..!

- నీటి వృథాపై సిపిఐ తీసుకున్న నిర్ణయంతో జలకళ
- తూములను సైతం పటిష్టపరిచిన ఇరిగేషన్
- చేపల కోసం నీరొదిలితే కరువు కష్టాలే

సెంటర్‌స్ప్రెడ్













# రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం






(మొదటిపేజీ తరువాయి)

ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్ట రేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి వాహనాలు పోకుండా అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున రైతులు నినాదాలు చేశారు. ఆందోళనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ కేసిఆర్ బాటలోనే తెలంగాణ ప్రభుత్వం రైతాంగ విషయంలో పయనిస్తుంద న్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట దెబ్బతిన్న తర్వాత రైతులు రెండవ పంటగా మొక్కజొన్నను సాగు చేశారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారని ఆయన తెలిపారు. ప్రభుత్వ వైఖరి కారణంగా మొక్కజొన్నపై రైతుల ఆశలు ఆడిఆశలయ్యాయని మొక్కజొన్నకు మద్ధతు ధర రూ. 2400 ఉండగా ఎగుమతులు నిలిచిపోవడం, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో క్వింటాకు రూ.1200 నుంచి రూ.1300లకు మాత్రమే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆవే దన వ్యక్తం చేశారు. తక్షణం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రూ.2400 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. రైతు భరోసా విష యంలో కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని ఇప్పటికే రైతు భరోసాకు సంబంధించి ఒక సీజన్ తప్పించిందని ఇప్పుడు మార్చి వచ్చిన రైతు భరోసా డబ్బులు వేయలేదని 22 నుంచి వేస్తామని చెబుతున్నా దశల వారీ అంటున్నారని అంతిమంగా ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పడం లేదని హేమంతరావు తెలిపారు. పెట్టబడికి అందించాల్సిన సాయం వ్యవసాయం ముగిసిన తర్వాత అందిస్తారా అని ఆయన ప్రశ్నిం చారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతూ రుణమాఫీ పూర్తయిందని ప్రకటిం చడం శోచనీయమన్నారు. రెండు లక్షలు పైబడిన సొమ్మును రైతులు చెల్లిస్తే రెండు లక్షల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని మంత్రులు ప్రకటించారని కానీ ఇంత వరకు ఆ పని చేయకుండానే రుణమాఫీ పూర్తయిందని ఎలా ప్రకటిస్తారని హేమంతరావు ప్రశ్నిం చారు. పంటల బీమాను అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు సీజన్లు గడిచినా పంటల బీమాను అమలు చేయలేదని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూ భారతి ధరణికి నకలుగా మారిందని 9.25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రైతులు పట్టాదారు పాసుపుస్త కాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిసిఎల్‌ఏ నిబంధనలు సాదా బైనామా అంటూ కాలయాపన చేయడం తగదన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని లేకపోతే ఆగ్రహా నికి గురికాక తప్పదని హేమంతరావు హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్య దర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, పావులూరి మల్లి కార్జున్, సీతారాములు, బానోత్ రాంకోటి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పి.వెంకట నర్సయ్య, పగిళ్ల వీరభద్రం, పుచ్చకాయల సుధాకర్, దొబ్బల వెంగళరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ‘పరాభవ’ం లోనూ ప్రశంసే..!

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు సంవత్సరం మొదలవుతుంది. చైత్రశుద్ధ పాడ్యమితో మొదలై వచ్చే ఏడాది ఫాల్గుణ బహుళ, అమావాస్యతో ముగుస్తుంది. ఆంగ్ల కాలమానం ప్రకారం 19 మార్చి 2026తో మొదలై 7ఏప్రిల్ 2027తో ముగుస్తుంది. మొత్తం తెలుగు సంవత్సరాలు 60 కాగా ప్రతి ఏడాది 60 ఏళ్లకు ఒక మారు తిరిగి వస్తుంటాయి. పరాభవ నామ సంవత్సరం 1966 1967లో రాగా తిరిగి 60 ఏళ్ల తర్వాత ఇప్పుడు 2026 2027లో వచ్చింది. 1966 నాటి పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. అప్పుడు దేశంపై యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించింది. ఇప్పుడు కూడా అంతర్జాతీయ యుద్ధ ప్రభావం దేశంపై పనిచేస్తుంది. ట్రంప్ యుద్ధ కాంక్ష సామాన్యులను సైతం ఇబ్బంది పెడుతుంది. 60 ఏళ్ల క్రితం వచ్చిన పరాభవ నామ సంవత్సరంలో దేశంలో ఆర్థిక సంక్షోభం, ఆహార కొరత తీవ్ర స్థాయిలో ఏర్పడ్డాయి. కాకపోతే ఆహార కొరత నేపథ్యంలో హరిత విప్లవం వచ్చి దేశ వ్యవసాయ రంగ చరిత్రను మార్చివేసింది. ఈ ఏడాది కూడా మంచే జరుగుతుందని పండితులు చెబుతున్నారు. విశ్వావసు సంవత్సరం ముగిసి పరాభవ నామ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా తెలుగు వారు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉగాదికి సంబంధించి అన్నింటి కంటే ముందుగా చెప్పుకోవాల్సింది షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి. తీపి, పులుపు, వగరు, కారం కూడిన ఏడు రుచులతో పచ్చడి చేసుకుని తింటే జీవితంలో కష్టాలను, సుఖాలను సమపాళ్లలో ఆస్వాదిస్తూ మెరుగైన జీవితం కోసం కృషి చేయవచ్చునని ఉగాది పచ్చడి చెబుతుందన్న నానుడి ఉంది. ఇక రైతులు ఈ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సాహ పూరిత వాతావరణంలో జరుపుకుంటారు. పరాభవ నామ సంవత్సరంలోనూ ప్రతి ఒక్కరూ ప్రశంసలు అందుకోవాలని ఇంటింటా ఆనందోత్సవాలు వెల్లివిరియాలని ఆశిద్దాం.




# పంచాయతీ కార్మికుల వాగ్దానాలను అమలు చేయాలి




ప్రజాపక్షం/ బోనకల్ : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని నిరసిస్తూ రావినూతల పంచాయతీ నందు బుధవారం పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానుద్ధేశించి తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు మధిర డివిజన్ కార్యదర్శి మరీదు పుల్లయ్య, జిల్లా నాయకులు బోయినపల్లి వీర బాబు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 2న ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ రద్దు చేయాలని, సిఎం హామీ ప్రకారం పంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని, మల్టీపర్పస్ వర్కర్ పని విధానం రద్దు చేయాలని, తదితర న్యాయ మైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ గుగులోతు నరేష్, గ్రామపంచాయతీ వర్కర్లు కొత్తపల్లి నారాయణ, ఎస్కే కాసిం, రమేష్, తాళ్లూరు ఏసు, బలగాని కృష్ణయ్య, కొత్తపల్లి బాబు, కోలా లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.












# పింఛన్‌దారులు.. ఉద్యమాలకు సిద్ధం కండి

**-25న నిరసన, ఆందోళన**
**-రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో పాటు కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన చట్టాల రద్దు కోరుతూ పింఛన్‌దారులు ఆందోళనకు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం పిలుపునిచ్చారు. గతేడాది పార్లమెంటులో ఆమోదించిన పెన్షన్ వ్యాలిడేషన్ యాక్ట్ పెన్షనర్ల పాలిట మృత్యుపాశం లాంటిదని ఈ చట్టానికి వ్యతిరేకంగా మార్చి 25న దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని అఖిల భారత పెన్షనర్ల సంఘం పిలుపునిచ్చిందని ఆమె తెలిపారు. బుధవారం ఖమ్మం కృషి భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సమావేశం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మేరీ ఏసుపాదం మాట్లాడుతూ ఉద్యోగ విరమణ బకాయిలను సత్వరమే చెల్లించాలని పెండింగ్ డిఏను మంజూరు చేసి ఏక కాలంలో చెల్లింపు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. హెల్త్ స్కీమ్‌ను ఈహెచ్ఎస్‌గా మార్చి పెన్షనర్ల సంఘాల నుండి ఆరుగురికి ప్రాతినిధ్యం కల్పించాలని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని పిఆర్‌సిని తక్షణం ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు ట్రెజరీ ద్వారా మార్కెట్ కమిటీ, గ్రంథాలయ ఉద్యోగులకు చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీను, నాయకులు పెదమాళ్ల సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, తాడి అంజలి, వెంకటేశ్వర్లు, కనపర్తి నాగప్రసాద్, ఊడుగు సుధాకర్, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, మెచ్చా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆశావర్కర్లు సంఘటితం కావాలి

**-రాష్ట్ర కన్వీనర్ కవిత పిలుపు**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడానికి, హక్కుల సాధనకు ఆశా వర్కర్లు సంఘటితమై పోరాటాలు చేయాలని రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర కన్వీనర్ నకిరేకంటి కవిత పిలుపునిచ్చారు. ఏదులాపురంలోని సిపిఐ కార్యాలయంలో ఆశా వర్కర్ల సమావేశం బుధవారం జరిగింది. 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా వర్కర్లకు నెలకు రూ. 18వేలు ఇస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపిన ఇంత వరకు ఏ ఒక్క హామీని అమలు చేయలేదని కవిత తెలిపారు. పాలకులకు ఎన్నికలప్పుడు మాత్రమే ఆశా వర్కర్లు గుర్తుకు వస్తున్నారని మిగిలిన సమయాల్లో సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీసం కాంట్రాక్ట్ వర్కర్లుగానైనా గుర్తించి కనీస వేతనాన్ని అమలు చేయడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్, జీవిత బీమాను అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో ఒరుగంటి శ్రావణి ని జిల్లా అధ్యక్షురాలిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఝాన్సీ, కోశాధికారిగా జానకమ్మను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు హుసేని తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్దిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ రాఘవ నామ సంవత్సర వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. బుధవారం ఆలయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల విజయదేవశర్మలు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి సంవత్సరం వలే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు క్షేత్ర సంప్రదాయమైన రుగ్వేద, వైదిక, స్మార్త, ఆగమ శాస్త్రానుసారం నవాహిక ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 19వ తేదీ గురువారం నుండి 27వ తేదీ శుక్రవారం వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం కలశ స్థాపన, 20న ధ్వజారోహణం, 25వ తేదీ బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం సాయంత్రం 5గంటలకు ఆలయ దాత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులచే గ్రామపద్ద చెరువు వద్ద తేప్పోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 27వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి వార కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించి స్వామి వారిని అమ్మవార్లను గ్రామసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సోమయ్య, కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లు పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలోని మధిర రైతు వేదిక నందు వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లను మధిర ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మధిర ఏడిఏ విజయచంద్ర మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకం దాదాపు పది సంవత్సరాల తర్వాత ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. దీనిలో భాగంగా చిన్నసన్నకారు రైతులకు 50శాతం సబ్సిడీ మీద పెద్ద రైతులకు 40శాతం సబ్సిడి మీద వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు రైతుల్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తుందన్నారు. దానిలో భాగంగానే వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మరల పునరుద్ధరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కోన ధనికుమార్, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# వెలుగుమట్లపై యథాతథ స్థితి

**-తీర్పును వెలువరించిన హైకోర్టు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలోని భూదాన్ భూముల్లో ఇండ్ల కూల్చివేతలకు సంబంధించి ప్రభుత్వ తీరుపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అసహనాన్ని వ్యక్తం చేసింది. బాధితులందరికీ న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు స్పష్టమైన దిశా నిర్దేశం చేసింది. ఈ భూములపై యథాతథస్థితిని కొనసాగించాలని కోర్టు ఆదేశించింది. 311 మందికే కాకుండా లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వెలుగుమట్లలోని పేదల ఇండ్ల కూల్చివేత జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఫిబ్రవరి 24న వెలుగుమట్ల రెవెన్యూలోని భూదాన్ భూముల్లో యుద్ధాన్ని మైమరిపించే రీతిలో పోలీసులు మోహరించి దాదాపు 700 ఇండ్లను కూల్చివేశారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొంది. కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి వైఖరిని అవలంభించనుందో తేలాల్సి ఉంది.

# ప్రజాపక్షం కథనంతో కదిలిన డొంక




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడులోని పిట్టలవారిగూడెం రైతులకు తెలీకుండా చేసిన భూబదలాయింపు, లోన్ పొందిన వ్యవహారంపై ప్రజాపక్షం దినపత్రిక డిసిసిబి బ్యాంక్‌లో లోన్ స్కాం అనే కథనాన్ని ప్రచురించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వెలుగులోకి తెచ్చిన ఘటనతో తీగలాగితే డొంక కదిలింది. సదరు రైతులకు భూమి చేసేందుకు చేపించుకున్న వ్యక్తి ఒప్పుకున్నట్లు సమాచారం. ఇందులో బ్యాంక్ నిర్వాహకులను తప్పిదారి పట్టించినట్లుగా గుర్తించారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై సదరు బాధితులు తహశీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కాగా అక్షరాలుగా మలిచి పరిష్కార మార్గం చూపిన ప్రజాపక్షానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాపక్షం అక్షరసత్యాలపై సైతం పలువురు అభినందనలు తెలిపారు.

# ప్రెస్‌క్లబ్‌లో చిత్ర పటాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ పాత్రికేయుల, సంపాదకుల ఫోటోలను ఆవిష్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపక్ చౌదరి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయుల చిత్ర పటాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు అంతోటి శ్రీను, అర్వపల్లి నగేష్, వి. సామ్రాట్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో భారీ వడగండ్ల వాన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం, మండలంలో బుధవారం సాయంత్రం భారీ వడగండ్ల వాన కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, గాలిదుమారంతో కూడిన వడగండ్ల వాన కురిసి వాతావరణం చల్లబడటంతో పట్టణవాసులు ఉక్కపోత నుండి కొంత ఉపసమనం పొందారు. భారీ వడగండ్ల వాన కురవడంతో పెద్దలు, పిల్లలు వడగండ్లను చూసి కేరింతలు కొట్టారు. అయితే మధిర మండలంలో కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంటకు కొంత నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు, ఉరుములు వడగండ్లతో కురిసిన అకాల వర్షం వలన చేతికొచ్చిన మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం ఏర్పడిందని రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99రోజుల ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మధిర మున్సిపాల్టీ, మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం ముమ్మరంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాల్వల పూడిక తీత, రోడ్ల వెంబడి పిచ్చి చెట్లు తొలగించటం, చెత్త చెదారం శుభ్రం చేయటం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్‌లు, మున్సిపల్, గ్రామపంచాయతీ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి 930పీ భూసేకరణపై రైతుల ఆవేదన



ప్రజాపక్షం/కారేపల్లి: హైదరాబాద్ వలిగొండ నుండి కొత్తగూడెం వరకు మంజూరైన జాతీయ రహదారి 930పీ నేషనల హైవే పనుల్లో భాగంగా భూసేకరణ ప్రారంభమైంది. ఈ క్రమంలో కారేపల్లి మండల పరిధి లోని పోలంపల్లి నుండి ్ధండి వరకు రైతుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోంది. అయితే ప్రస్తుత మార్కెట్ ధర ఎకరానికి సుమారు 30లక్షల రూపాయలు ఉన్నప్పటికీ, అధికారులు కేవలం 11లక్షల రూపాయలు మాత్రమే నిర్ణయించడం వల్ల గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పోలంపల్లి సర్పంచ్ దారావత్ హేమలత, మాజీ సర్పంచ్ ధారావత్ భద్రు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం రైతులు ఖమ్మం ఆర్డీవో, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. రైతులకు న్యాయం చేయాలని కోరగా, అదనపు కలెక్టర్ స్పందిస్తూ గిరిజన రైతులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రైతులు మల్సూర్, సుదీప్, సోమల, రాందాస్, జరపల వీరన్న, రమేష్, రాజేష్, దేవా, బానోత్ హాసింగ్, పులి వీరన్న, లాల్‌సింగ్, భద్రు దేవులాల్, వీరు, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ నిధుల పంపిణీ

**-తహసీల్దార్ కార్యాలయంలో రూ 54వేల చెక్కు అందజేత**



ప్రజాపక్షం/ములకలపల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ములకలపల్లి మండలంలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ 54వేల ఆర్థిక సహాయాన్ని తహసీల్దార్ భాగ్యలక్ష్మి అందజేశారు. బుధవారం ములకలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ముస్లిం పెద్దలకు చెక్కును అందజేశారు. ఈ నిధులతో మండలంలో ఇఫ్తార్ విందును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మజీద్ సదర్ మహమ్మద్ జాహిరుద్దీన్, ఎండి సికిందర్, కమిటీ సభ్యులు ఎస్‌కే జబ్బర్, ఎండి యూసుఫ్, ఎస్‌కె మైనుద్దీన్, ఎండి రిజ్వాన్, ఎస్‌కె భాష, ఎస్‌కె వహీద్ పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షునికి సన్మానం



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సారపాక సర్పంచ్ గుగులోత్ శివరాం నాయక్‌కు టీఎన్‌టీయూసీ మరియు మిత్రపక్షాల నాయకులు ఘనంగా సన్మానం చేశారు. మంగళవారం భద్రాచలంలో నిర్వహించిన జిల్లా సర్పంచుల సమావేశంలో గుగులోత్ శివారం నాయక్‌ను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా బుధవారం ఐటిసి భద్రాచలం టీఎన్‌టీయూసి మిత్రపక్షాల కార్యవర్గ సభ్యులు సారపాక గ్రామ పంచాయితీ కార్యాలయంలో శివారం నాయక్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనకు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేశారు. ఈసందర్భంగా ఐటీసీ టీఎన్‌టీయూసీ అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ మాట్లాడుతూ గుగులోత్ శివరాం నాయక్ నాయకత్వంలో జిల్లా సర్పంచుల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గల్లా నాగభూషయ్య, ప్రధాన కార్యదర్శి గాదరామ కోటిరెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, కరి రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## నవోదయలో సీటు సాధించిన విద్యార్థి జస్వంత్‌కు అభినందనలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: 2026,27 విదవ్యా సంవత్సరానికి గాను ఇటీవల ప్రకటించిన నవోదయ ప్రవేశ ఫలితాలలో సార పాకలోని బ్రిలియంట్ కోచింగ్ సెంటర్‌కు చెందిన ఎం జస్వంత్ ప్రతిభ కనబరుస్తూ నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. ఈ విజయంతో విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు, గురువులకు గర్వకారణమైంది. ఈ సందర్భంగా జస్వంత్‌ను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు హృద య పూర్వకంగా అభినందిం చారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్‌ఆర్ మాట్లాడుతూ తన కోచింగ్ సెంటర్ నుండి ప్రతీ సంవత్సరం అనేక మంది విద్యార్థులు నవోదయ, సైనిక్ స్కూల్‌లలో సీట్లు సాధించడం ఎంతో ఆనందకరమని తెలిపారు. ఇటీవల విడుదలైన సైనిక్ స్కూల్ ఫలితాల్లో కూడా బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ నుండి ఏకంగా ఏడుగురు విద్యార్థులు సీటు సాధించారని పేర్కొన్నారు. రాబోయే నవోదయ రెండో జాబి తాలో కూడా తమ విద్యార్థులు మరిన్ని సీట్లు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇంతటి విజయానికి సహకరించిన తల్లిదండ్రుల కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, జస్వంత్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఎండకాలంలోనూ నిండుగా నీళ్లు..!

**- నీటి వృథాపై సిపిఐ తీసుకున్న నిర్ణయంతో జలకళ**
**- తూములను సైతం పటిష్టపరిచిన ఇరిగేషన్**
**- చేపల కోసం నీరొదిలితే కరువు కష్టాలే**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఎండకాలం వస్తే నీటి సమస్య తీవ్రంగా మారుతోంది.చెరువులు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి నీటి సమస్య ఏర్పడుతుంది. కానీ ఏదులాపురంమున్సిపాలిటీ మిని ట్యాంక్ బండ్‌గా పేరుగాంచుతున్న ఏదులాపురం చెరువు జల కళను సంతరించుకొని ఎర్రటి ఎండలోనూ నిండుకుండలా ఉంది. ఇందుకు ఇక్కడి సిపిఐ పార్టీ నీటి వృథాపై తీసుకున్న నిర్ణయం నీటి నిల్వకు దోహదపడిందనే చెప్పాలి. చెరువులోని చేపలు పట్టేందుకు తూముల ద్వారా నీటిని వదలకుండా తీసుకున్న జాగ్రత్తలు భూగర్భజలాలు పదిలంగా ఉండేలా చేశాయి. అలాగే వర్షపు నీటి నిల్వ, కాలువల శుభ్రపరిచిన పనులు ముందుగానే చేపట్టడంతో నీటి నిల్వలు నిలిచాయి. కానీ చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలతో నీటి నిల్వలకు ఆటంకంగా మారింది.

**సిపిఐ నిర్ణయంతో నీటి వృథాకు చెక్...**

గత ఎండాకాలంలో చెరువు ఎండిపోయి ఏర్పడిన నీటి కటకటపై ఇక్కడ సిపిఐ పార్టీ తీసుకున్న నిర్ణయం నీటి నిల్వలు ఉండేందుకు దోహదపడింది. తూముల ద్వారా నీటిని బైటికి వదలకుండా తీసుకున్న కట్టుదిట్టమైన కృషి ఫలించింది. అలాగే ఏదులాపుం మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో సిపిఐ కౌన్సిలర్లు గళమెత్తిన నేపథ్యంలో అధికారులు చొరవ చూపారు. ప్రధానంగా సిపిఐ 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు కృషితో ఇరిగేషన్ అధికారులు పడైపోయిన తూమును పటిష్టంగా మరలా నిర్మాణం చేశారు. ఈ నేపథ్యంలో ఏదులాపురంతో పాటు చెరువు చుట్టు ఉన్న వార్డులలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. అలాగే చెరువు కిందివైపు ఉన్న వరంగల్‌క్రాస్‌రోడ్, పెద్దతండాతో పాటు వాటి పరిధిలలోని కాలనీలలోని బోర్లలో నీరు పుష్కలంగా ఉన్నాయి. అంతేకాకుండా మంచినీటి సౌకర్యం అందిచేందుకు ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకానికి నీరు అందుతోంది. దీంతో 35గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీరు సరఫరా అవుతోంది.

**చేపల కోసం నీరొదిలితే కష్టాలే...**

కొద్దిమంది లాభం కోసం చెరువు నుంచి నీరొదిలితే కరువు కష్టాలు ఏర్పడి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, ఆవేదన వ్యక్తమౌతుంది. అలాగే ఇదే విషయాన్ని నీటి వనరుల శాఖ అధికారులు నొక్కి చెబుతున్నారు. ఈ విషయం చెరువు భాగస్తులకు కొంచెం కష్టంగా కనపించిన అదే నిజమనే చెప్పాలి. అయితే ఇటీవల చేపల వ్యాపారం ప్రాధాన్యం పెరగడంతో చెరువుల్లో వాటి పెంపకం పెరిగింది. వాస్తవానికి చెరువులో చేపలు పోసుకున్న వారికి, నీరు తగ్గాలని చూస్తుంటారు. వారి వైపు నుంచి ఇది బాగానే ఉన్నా ప్రజలకు మాత్రం ఇబ్బందికరమైన అంశమే. ఏది ఏమైనప్పటికీ భూగర్భజలాల ముప్పును తెచ్చుకోవడం మాత్రం సరైన విషయం కాదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో చేపలా?, నీరా? అని చూస్తే నీరు అనే డిమాండ్ వ్యక్తమౌతుంది.

## విద్యార్థులు పఠన సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాపక్షం/కొత్తగూడెం : విద్యార్థులు పఠన సమార్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మౌళిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనాల పై పెచ్చు ఊడిపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కోయగూడెం ప్రాథమిక బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన 9వ తరగతి విద్యార్థుల ఇంగ్లీష్, తెలుగు పాఠ్యపుస్తకాలను చదివించి సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠ్యాంశాలు చదివే క్రమంలో విద్యార్థులు తబడుతుండటంతో ఆయన ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి శ్రీరామ్, తహశిల్దార్, ఎంపిడిఓ, హెచ్‌ఎంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో టిఎన్‌ఆర్ ట్రస్ట్

**- రూ. 30 లక్షలతో రంజాన్ తోఫా పంపిణీ**
**- రూ. 50 లక్షలతో విద్యుత్ సౌకర్యం**
**- పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధునాతన కంప్యూటర్ ల్యాబ్**




ప్రజాపక్షం/పాల్వంచ : తాండ్రనారాయణరావు ట్రస్ట్ అధినేత వెంకటేశ్వరరావు సారధ్యంలో పలు సామాజిక సేవలను అందిస్తూ ప్రజాసేవయే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదని ట్రస్టు సభ్యులు నరాటి ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ములకలపల్లి మండలం, కొత్తగూడెం నియోజక వర్గంతో పాటుగా మున్సిపల్ కార్పోరేషన్ 60 డివిజన్‌లలో పేద ముస్లీంలు రంజాన్ పండుగను సంతోషాలతో జరుపుకోవటానికి సుమారు 30 లక్షలతో రంజాన్ తోఫా అందించామని తెలిపారు. లక్షల వ్యయంతో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల. జగన్నాధపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సాంకేతిక పరంగా అభివృద్ధి చెందటానికి అధునాతన కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పాల్వంచలోని హమాలి, వనమా కాలనీలలో పేదల దాహార్తిని తీర్చటానికి సొంత ఖర్చులతో బోరు బావులను తవ్వించి ట్యాంకులను నిర్మించామన్నారు. అదేవిధంగా పలు గ్రామాలలో క్రైస్తవుల ప్రార్థనా మందిరాలు చర్చీలు, ముస్లీముల కోసం మసీదులు, హిందువుల కోసం దేవాలయాల నిర్మాణాలలో భాగమై ప్రజలంతా ఒక్కటే అని చాటి చెపుతూ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ములకలపల్లి మండల పరిధి పోగళ్ళపల్లిలో గిరిజన ప్రజల తాగు నీటి సౌకర్యంతో పాటుగా అదనంగా 50 లక్షలతో సాగు నీరందించేందుకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.



దీనితో గిరిజనలు వే యి ఎకరాలలో సాగు చేసుకొంటూ మూడు పంటలు పండిస్తున్నారని అన్నారు. అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ట్రస్ట్ సేవలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నదని చెప్పారు. అమెరికాలో ఉంటూ వివిధ వ్యాపారాలతో నిత్యం బిజీగా ఉండే ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావు మాతృభూమిని మరచిపోకుండా, తనకు జన్మనిచ్చిన ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని స్పష్టం చేశారు. సమాజ సేవలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్న టిఎన్‌ఆర్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావును నేటి యువత ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలను చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాండ్ర బుచ్చిబాబు, ఇనుగంటి రాము, కొదుమూరి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# నాడు మన తాతయ్యల కట్టు.. నేడు వేడుకల్లోనే పంచెకట్టు..!

**-నానాటికీ మటు మాయమైపోతున్న పంచెకట్టు సంప్రదాయం**
**-ఈ రోజుల్లో కోటికొక్కరుగా మిగులుతున్న పంచెకట్టు పెద్దలు**
**-షాట్లు, లోయర్ల మోజులో 'కట్టు' విడుస్తున్న నేటి తరం**



ప్రజాపక్షం/కొణిజర్ల : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును ఒక్కసారి కళ్ల ముందుకు తెచ్చుకోండి. అందమైన పంచెకట్టుతో తెలుగుదనం ఉట్టిపడేలా ఉండే ఆహార్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇక మరో మాజీ సీఎం వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలువెత్తు ఫొటోని ఒక్కసారి చూడండి. తెలుగు సంప్రదాయానికి అర్థం చెప్పేలా సొగసైన పంచెకట్టులో ఆరడుగుల అందం తారసపడుతుంది. ఇక నేటి తరంలో మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒక్కరే ఆ పంచెకట్టు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో ప్యాంటు, షర్టు సొగసుల్లోనే తప్ప ఏ ఒక్కరూ పంచె కట్టుతో కనిపించరు. ఇది మన తాతల నాటి ప్రాచీన సంప్రదాయం కనమరుగవుతున్న తీరుకు అద్దం పడుతోంది. పాశ్చాత్య పోకడలకు అలవాటు పడుతున్న నేటి తరం ప్రజానీకం మన సంప్రదాయాన్ని పక్కన పెట్టేసి షాట్లు, లోయర్ల మోజులో పడి 'పంచె కట్టు'ను వదిలేశారు. ఈ ఫలితంగా నేడు పంచెకట్టే మటు మాయమైపోయింది.

డెబ్బై దశకంలో పుట్టి ఇప్పటికీ ఆరోగ్యంగా వర్ధిల్లుతున్న మన పూర్వీకులను అక్కడక్కడా చూస్తూనే ఉన్నాం. వాళ్లు ఆరడుగుల ఎత్తుతో పంచెకట్టుతో పోత పోసిన విగ్రహంలా కనిపిస్తారు. వీళ్లు మన చరిత్ర మనకు మిగిల్చిన ఆనవాళ్లు అని చెప్పాలి. ఆ రోజుల్లో పురుడుపోసుకున్న పూర్వపు పంచెకట్టు సంప్రదాయాన్ని నేటికి కూడా తు.చ తప్పకుండా పాటిస్తూ మన భారతీయ వైవిధ్యాన్ని చెక్కు చెదరకుండా నిలబెడుతున్నారు. అయితే పొంచి ఉన్న ప్రమాదం ఏమిటంటే మరో పదేళ్ల కాలం గడిస్తే ఈ పెద్దలు కాల గర్భంలో కలిసిపోతారు. ఆ తర్వాత 'పంచె కట్టు' అనేది కేవలం ఫొటోల్లో మాత్రమే చూసుకుని మురిసిపోయే రోజులు వస్తాయేమో అనిపిస్తుంది. కచ్చితంగా వస్తాయి కూడా. ఎందుకంటే నేటి తరం పాశ్చాత్య పోకడలకు అలవాటు పడి మన సంప్రదాయాలను మంటల్లో కలిపేస్తున్నారు. తాజాగా మార్కెట్‌ని ముంచెత్తుతున్న షార్టులు, లోయర్లకు అలవాటు పడుతూ పంచెకట్టు కాదు కదా.. కనీసం లుంగీ కట్టును కూడా విస్మరించేస్తున్నారు. ఈ ఫలితంగా మన పూర్వపు వైభవం మట్టిలో కలిసిపోయే ప్రమాదం కనిపిస్తోంది.



"మా అబ్బాయికి పంచె కట్టు వేడుక జరుపుతున్నాం.. మీరంతా కుటుంబ సమేతంగా హాజరు కావాలి." ఇది పైసలున్న పెద్దలు ఇటీవల ఫ్యాషన్‌గా మార్చుకున్న వేడుక. అయితే చెవులకు ఎంతో విన సొంపుగా అనిపించే ఈ పంచెకట్టు వేడుక ఆ వేదిక దిగిన తర్వాత ఏమాత్రం కనిపించదు. పంచెలు వేయడం అనేది ఇప్పుడు పెద్దల వేడుకగా మాత్రమే మారిపోయింది. ఆ శుభకార్యంలో మాత్రమే పిల్లలకు పంచెను కట్టి ఆ తర్వాత దాన్ని తీసి పక్కన పడేస్తున్నారు. ఇక్కడ మరో విచిత్రమేమిటంటే ఇప్పుడు మార్కెట్లోకి పంచెను పోలిన ప్యాంట్లు కూడా వచ్చాయండోయ్.! అచ్చం పంచె కట్టులాగే కనిపించే ఈ ప్యాంటును పిల్లలకు ధరింపజేసి కాగల కార్యం ముగించేస్తున్నారు. ఇక ఆ తర్వాత మన సంప్రదాయపు 'కట్టు'ను భుజాలపై నుంచి దించేస్తున్నారు. పాశ్చాత్య పోకడల ఫలితంగా దిగుమతి అయిన షార్టులు, లోయర్లను ధరిస్తూ కాలం గడిపేస్తున్నారు. ఈ ఫలితంగా మన భారతీయ సంప్రదాయాన్ని బొట్టు లాంటి మన పంచె కట్టును మరిచిపోతున్నాం. కోటికొక్కరుగా కనిపిస్తున్న మన పూర్వీకులు కూడా ఈ నేలను విడిచి వెళితే ఇక ఈ పంచె కట్టు ఫొటోల్లోనే చూసుకునే పరిస్థితి తర్వలోనే రానున్నట్లు స్పష్టమవుతోంది.

**పంచె కట్టులో ఉన్న హుందాతనం ఫ్యాంట్‌లో ఉండదు : గడల సీతారామయ్య తనికెళ్ల మాజీ సర్పంచ్**

పంచె కట్టులో ఎంతో హుందా తనం ఉంటుంది. పంచెకట్టి ఏ కార్యాలయానికి వెళ్లినా రా పెద్దాయనా అని అంటారు. ఎందుకంటే ఆ పంచెకట్టుకు అంత హుందా తనం ఉంటుంది. మా తాతలు, మానాన్న కూడా పంచె కట్టేవారు. మా ముగ్గురు అన్నల తమ్ములముకూడా ఇప్పటివరకు అదే పంచెకట్టు సాంప్రదాయాన్ని పాటిస్తున్నాము. మన దేశ ప్రధానమంత్రి పివి నరసింహారావు కూడా పంచె కట్టె మన సాంప్రదాయాన్ని కాపాడాడు.

**నేటితరం కూడా పంచెకట్టు ఆచరిస్తే బాగుంటుంది : సిపిఐ సీనియర్ నాయకులు కవిడ వీరభద్రం**

పంచెకట్టడం అనేది మన భారతదేశంలోనే ఎక్కువగా ఆచరిస్తారు. అది మన సాంప్రదాయం. నేటి తరం పొట్టి లాగుల్లో తిరుగుతుండటంతో మన సాంప్రదాయం కనుమరుగు అవుతుంది. నా చిన్నప్పుడు బడికిపోయేటప్పుడు మాత్రమే పొట్టి లాగులు వేసుకునేవారు. కాని విచిత్రమేమిటో కాని పెళ్లయి పిల్లలున్న వాళ్లకూడా పొట్టి లాగు వేసుకొని రోడ్లమీద తిరుగుతున్నారు. ఇప్పటికైన యువత పంచెకట్టకపోయినా కనీసం లుంగీ కట్టుకొని తిరిగినా ఫర్యాలేదు.





**పంచె కట్టు వేడుకలకే పరిమితం అయింది : చల్లా నారాయణ సిపిఎం నాయకులు**

మన ప్రాచీన సాంప్రదాయం అయిన పంచె కట్టు ఇప్పుడు కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం అయింది. అదికూడా పంచె కట్టకుండా పంచెలాగా కుట్టిన దుస్తులు షాపుల్లోకి వచ్చాయి. వాటిని ఫ్యాంట్ తొడిగినట్లు తొడుగుతున్నారు. ఈ తరం పోతే కనీసం పంచె కట్టే విధానం కూడా తెలిసినవాళ్లు ఉండరు. మన సాంప్రదాయాన్ని కొనసాగించే విధంగా నేటి తరం నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ




ప్రజాపక్షం/పాల్వంచ : తాండ్ర వెంకటేశ్వరరావు, మహ్మద్ కాజీం అలీల సారధ్యంలోని టిఎన్‌ఆర్ ట్రస్టు సేవలు పేద ప్రజల గుండె చప్పుడు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం పాల్వంచ సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో పేద ముస్లీం కుటుంబాలకు తాండ్ర నారాయణరావు ట్రస్టు సభ్యులు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ నేతృత్వంలో ముత్యాల విశ్వనాధం చేతల మీదుగా ముస్లీం సోదరులకు 14 రకాల నిత్యావసర సరులతో కూడిన రంజాన్ తోఫా కిట్లను అంజేశారు. ఈ సంధర్భంగా విశ్వనాధం మాట్లాడుతూ టిఎన్‌ఆర్ ట్రస్టు సేవలు విలువ విలువ కట్టలేనివన్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతున్న ఆ ట్రస్టు మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేద ప్రజల ఊపిరిగా ట్రస్టు మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేద ప్రజల ఊపిరిగా నిలవాలని ఆకాంక్షించారు. 35వ, డివిజన్ పరిధి జ్యోతినగర్, విద్యుత్ ఎంప్లాయిస్ కాలని, సీతారామపట్నం తదితర ప్రాంతాలలోని బుధవారం పేద ముస్లీం కుటుంబాలకు రంజాన్ తోఫా ప్యాకెట్లను అందజేశారు. కార్పోరేటర్ కీర్తి చేతుల మీదుగా పంపిణి చేశారు. అనంతరం కీర్తి మాట్లాడుతూ టిఎన్‌ఆర్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావు సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిఉఇఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు చెరుకూరి శేఖర్‌బాబు, టిఎన్‌ఆర్ ట్రస్టు సభ్యులు, సిపిఐ, టిడిపి నాయకులు నల్లమల్ల వేణు, కొమ్మవరపు ఆదాం, మేదరమెట్ల నారాయణ, కే. వెంకటేశ్వరరావు, బెల్లం పద్మ, హనుమంతరావు, మద్దినేని నాగమణి, ఆళ్ల నాని, నామా నవీన్, నామా పండు, మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చెత్త నిర్వహణపై దిశా నిర్దేశం




ప్రజాపక్షం/బూర్గంపాడు: ఇరవెండి గ్రామ పంచాయితీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాల్వంచ డిగ్రీ కలేజ్ విద్యార్థులకు చెత్త నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేరు చేయడం అలాగే వర్మి కంపోస్ట్ తయారీ విధానం గురించి వివరంగా తెలియజేశారు. ఆ అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయితీ కార్యాలయం నుండి డంపింగ్ షెడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డంపింగ్ షెడ్ వద్ద వర్మి కంపోస్ట్ తయారీ విధానం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు, చెత్తను వర్గీకరించడం అవసరంపై ఎస్పీఎం నుండి వచ్చిన రేవంతి పాల్గొన్న విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ రవి, గ్రామ పంచాయితీ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు, పాలకవర్గ సభ్యులు దుర్గ, లక్ష్మి, బత్తుల శిరీష, కరం సామ్రాజ్యం, గ్రామ కార్యదర్శి స్పందన, ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ వెంకట్, టీఏలు, ఎఫ్ఏలు, కళాశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయితీ మల్టీ పర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

## సారపాకకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ రాక

**-బిపిఎల్ గెస్ట్ హౌస్ వద్ద అధికారుల ఘన స్వాగతం**



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సారపాకలోని బిపిఎల్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. గెస్ట్ హౌస్‌కు చేరుకున్న బక్కి వెంకటయ్యకు అధికారుల బృందం ఘన స్వాగతం పలికారు. డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్ తదితరులు ఆయనను ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, దమ్మపేట ఏటిడీఓ చంద్రమోహన్, భద్రాచలం ఏఎస్డబ్ల్యూ హనుమంతరావు, పాల్వంచ ఏస్డబ్ల్యూ, హెచ్‌డబ్ల్యూ అక్షయ్‌తో పాటు గిరిజన సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఛైర్మన్ పర్యటనలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మన్



ప్రజాపక్షం/భద్రాచలం : దుమ్ముగూడెం మండల పరిధిలోని పర్ణశాల సీతారామ చంద్ర స్వామివారి ఆలయాన్ని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమీషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయానికి విచ్చేసిన వారికి దేవస్థానం సాంప్రదాయాను సారం స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలోని స్వామికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అర్చక స్వాములు స్వామివారి పట్టువస్త్రాలు అదించి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం పర్ణశాల గోదావరిలో కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా బోట్ షికారు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పోరేషన్ ఉద్యోగులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 196 కోట్లతో ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్



**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**-ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్, కౌన్సిల్‌లో పాల్గొన్న కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ బడ్జెట్ రూ. 196 కోట్లతో ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్‌లో నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అత్యంత ముఖ్యమైన కార్పోరేషన్ ఖమ్మం మాత్రమేనన్నారు. రూ. 196 కోట్లతో 2026 27 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని ఈ నిధులతో నగరవాసులకు మెరుగైన సేవలు అందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్పోరేషన్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మంచి సంస్కరణలు తీసుకువచ్చి చాలా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్పోరేషన్‌లో ప్రతి రోజు పని ఉంటుందని చెత్త సేకరణ, డ్రైన్లు క్లిన్ చేయడం, స్ట్రీట్ లైట్ నిర్వహణ, నీటి సరఫరా వంటి పనులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. నగర పరిధిలో స్ట్రీట్ లైట్ మానిటరింగ్ కోసం సెంటర్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్పోరేషన్ పరిధిలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం కానీ పక్షంలో సంబంధిత లబ్దిదారుల నుంచి లెటర్ తీసుకుని అర్హులైన ఇతర లబ్దిదారులకు కేటాయింపులు జరిగేలా ఏఈ హౌజింగ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. 43వ డివిజన్ పరిధిలో చేపట్టిన విధంగా కార్పోరేషన్ వ్యాప్తంగా ఆస్తుల విలువలు మరోక సారి పరిశీలించి ఆస్తి పన్ను సవరించాలని కలెక్టర్ సూచించారు. సొంత ఆదాయాలను పెంచుకోవడంపై కార్పోరేషన్ దృష్టి సారించాలన్నారు. నగరంలో ఎక్కడ చీకట్లు ఉండకుండా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. నీటి కనెక్షన్, ఇతర పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టినప్పుడు వాటి మరమ్మతులకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ అధికంగా జరుగుతుందని దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున సాంకేతికత ఆధారంగా వీటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను గుర్తించి జరిమానాలు వెంటనే విధించేలా చూడాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అమృత పథకం ద్వారా త్రాగునీటి సరఫరా పనులు, ఎస్‌టిపి నిర్మాణం, ఖమ్మం ఖిల్లా రోప్‌వే వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కార్పొరేటర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. నగర పరిధిలో రూ.2.50 కోట్లతో ముఖ్యమైన రహదారుల విస్తరణ పనులు చేపట్టామని ఈ ఏడాది కాలంలో 23 కిలో మీటర్ల మేర సిసి రోడ్లు, 18 కిలో మీటర్ల సిసి డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. అమృత్ పథకం క్రింద రూ.229 కోట్లతో చేపట్టిన మంచినీటి సరఫరా పనులు తుది దశలో ఉన్నాయన్నారు. విలీన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని, కుక్కల సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఖమ్మం నగర పాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని మేయర్ తెలిపారు. బడ్జెట్ అంచనాలను సమావేశంలో నగర పాలక సంస్థ పరిపాలన అధికారి సిహెచ్ శ్రీనివాస్ వివరించారు. పన్నుల వనరుల క్రింద రూ. 50.43 కోట్లు, పన్నేతర వనరుల ద్వారా రూ.96.94 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌ల ద్వారా రూ. 7.90 కోట్లు మొత్తం రూ. 104.84 కోట్ల ఆదాయ అంచనా ఉందని తెలిపారు. ఖర్చుల క్రింద ఛార్డ్జ్ ఖర్చులు రూ.63.44 కోట్లు, నిర్వహణ ఖర్చులు రూ.18.03 కోట్లు, విలీన గ్రామాలు, పబ్లిక్ ఎమిటెన్స్, వార్డు బడ్జెట్ క్రింద రూ. 16.01 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌లు, రుణాల క్రింద రూ. 7.90 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్టు ఫండ్స్ క్రింద రూ.91.02 కోట్లుగా అంచనా వేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు తీగల వంతెన నిర్మాణం ద్వారా షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ప్రతిపక్ష కార్పొరేటర్లను పిలవాలన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రికి చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం, వీధి లైట్ల నిర్వహణ, పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలన్నారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఆయా డివిజన్లలోని సమస్యలను అధికారుల దృష్టికి కార్పొరేటర్లు తీసుకు వచ్చారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అటవీ, రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి చర్యలు



**-సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అటవీ, రెవెన్యూ భూ వివాదాలు పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డిఎఫ్‌వోలతో కలిసి అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ భూమి సరిహద్దుల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కనకగిరి ఘాట్ అటవీ ప్రాంతం సంబంధించి కొంత భాగం భూమి రికార్డ్ సరిహద్దులు సరిగ్గా నమోదు కాలేదని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో సమాంతరంగా సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అటవీ, రెవెన్యూ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వీరు 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోర్టు కేసులు మినహాయించి రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారమయ్యే సర్వే నెంబర్ వివాదాలను రెవెన్యూ, అటవీ అధికారులు మండలాల వారిగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కనకగిరి ఘాట్ అటవీ ప్రాంతం సంబంధించి ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో కొంత భాగం మిగిలిపోయిన భాగాన్ని సర్వే చేసి రెవెన్యూ బౌండరీ క్షేత్రస్థాయిలో ఫిక్స్ చేసుకోవాలని, నాలుగు బృందాల ద్వారా సర్వే నిర్వహించి ఖమ్మంజిల్లా బౌంబరీలో గల అటవీ, రెవెన్యూ భూములు మన పరిధిలో రికార్డు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు ఈ సమావేశంలో ఖమ్మం డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, కొత్తగూడెం డిఎఫ్‌వో కృష్ణా గౌడ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**-బస్టాండ్ సమస్యలపై ఆరా**
**-డీఆర్‌డీఏ పీడీ విద్యా చందన**






**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ విద్యా చందన అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె స్థానిక బస్టాండ్ ఆవరణలో నిర్మించిన మరుగు దొడ్ల భవనాన్ని పరిశీలించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈసందర్భంగా బస్టాండ్ ఆవరణలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు తెలియజేయగా, సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే వారు అందుబాటులో లేకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా బెండపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివో భవన పనులను వేగవంతం చేయాలని సూచించారు. రావికంపాడు గ్రామంలో ఇంకుడు గుంతలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఎంపీడీవో అశోక్, ఎంపీఓ ఖాన్, గ్రామ సెక్రటరీ ప్రశాంత్, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు బుంగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ సీటు సాధించిన కాకతీయ విద్యాలయం విద్యార్థులు





**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలోని కాకతీయ విద్యాలయం విద్యార్థులు నవదోయ ఎంట్రన్స్ పరీక్షల్లో ఇద్దరు సీటు సాధించారు. ధర్మసూత్తు మోక్షిత్, జల్ది సాత్విక నవోదయ సీటు సాధించటంతో వారిని పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందించారు.

# ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**తనికెళ్ల సర్పంచ్ గడల కళావతి**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తనికెళ్ల గ్రామప్రజలకు నూతన తెలుగుసంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పరాభవనామ సంవత్సరంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు తమ సహాయసహకారాలు అందించాలని కోరారు.

# లక్ష్మీపురంలో పాఠశాలలో ఉగాది వేడకలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఉగాది వేడుకలు బుధవారం నిర్వహించారు. పరాభవనామ సంవత్సరం సందర్భంగా పాఠశాలలో ఉగాది పచ్చడి చేయించి అందరికి తినిపించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కరామత్ ఆలీ మాట్లాడుతు ఉగాది పచ్చడిలో షడ్రుచులు ఏవిధంగా ఉంటాయో మన జీవితాల్లో కూడా సుఖసంతాషాలతో ఉందరు ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిలకమ్మ, సువార్త, సుశీల, మౌనిక, భవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఉపాధి హామీ పథకం పనులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని కోనాయిగూడెం లో ఉపాధి హామీ పథకం పనులను బుధవారం పరిశీలించారు. కూలీల మస్టర్ ను పరిశీలించారు. కూలీల ముఖ హాజరు ను స్వయంగా సెల్ ఫోన్ లో తీశారు. ఉపాధి హామీ పథకం లో వచ్చిన మార్పులను కూలీలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పథకం యెక్క నిబంధనలు పాటించి కూలీ వేతనాలు పొందాలని సూచించారు. పని ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూలీ అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం పనుల వినియోగంలో జిల్లాలోనే మండలం ఆదర్శంగా ఉండేలా ఎక్కువ మంది కూలీలు హాజరైయ్యాలా చూడాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్ కుమార్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌నాగేందర్, క్షేత్ర సహాయకులుతిగుళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

# సుబ్లేడ్ గ్రామంలో పారిశుధ్య పనుల్లో పురోగతి

**సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో పారిశుధ్య పనుల్లో ఎంతో పురోగతిని సాధించామని ప్రభుత్వం ఇటీవల గ్రామాల పరిశుభ్రత లో భాగంగా తీసుకువచ్చిన ప్రజా ప్రభుత్వంలో ప్రగతి ప్రణాళికలో భాగంగా పనులను వేగవంతంగా చేస్తున్నామని ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు మంచినీటి సరఫరా మౌలిక వసతుల కల్పనలో రాజీ లేకుండా పనులు చేపిస్తున్నామని సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి అన్నారు. సుబ్లేడు గ్రామంలో ఎప్పటినుండో పారిశుధ్యనికి నోచుకోకుండా ఉన్న సైడ్ కాలవలను శుభ్రపరిచామని ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు. గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు నూతన పాలకవర్గం కృషి చేస్తుందని ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలోనే జిల్లాలోనే గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పగడాల రాజ కుమార్ గ్రామాన్ని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతి రూపాయిని గ్రామ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని రానున్న రోజుల్లో సుబ్లేడ్ గ్రామపంచాయతీలో ఎన్నో మార్పులు చూస్తారని గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు.

# భద్రాద్రిలో నేటి నుండి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు



- కొనసాగుతున్న శ్రీరామ నవమి ఏర్పాట్లు
- పట్టణంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు
- 27న శ్రీరామ నవమి, 28న పట్టాభిషేకం
- ముఖ్యమంత్రి, గవర్నర్ రాక
- భక్తులకోసం సకల సౌకర్యాలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో నేటి నుండి వసంత పక్ష ప్రయుక్త, నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో భద్రాచలం పట్టణంలో పండుగశోభ సంతరించుకుంది. పట్టణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇంజనీరింగ్ పనులు ఇప్పటికే పూర్తికాగా మిథిలా స్టేడియం, ఆలయ చుట్టు ప్రకారాల వద్ద పనులు కొనసాగుతున్నాయి. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఛాందినీ వస్త్రాలతో చూడ ముచ్చటగా పందిళ్ళు ఏర్పాటు చేస్తున్నారు. గాలిగోపురంతో పాటు చుట్టు ప్రకారాలకు విద్యుత్ దీపాలు అలంకరించారు. దీంతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతోంది. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా శ్రీరామనవమి వేడుక తెలిసే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా వాల్ పోస్టర్లు అంటించడంతో పాటు బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయమే వేపపూత ప్రసాద వినియోగం, శ్రీ సీతారామచంద్ర స్వామివార్ల మూల వరులకు ప్రంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్ర వేళ నూతన పంచాగ శ్రవణం చేస్తారు. వసంత పక్ష బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిత్యకళ్యాణాలను రద్దు చేశారు.

**27న రామ నవమి :**

ఈ నెల 27వ తేది శ్రీరామ నవమి, 28న పట్టాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. మార్చి 23న మండల లేఖ యాగశాల, అలంకరణలు, 24న గరుడ ధ్వజ పట లేఖనం, ఆవిష్కరణ, 25న అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, 26న ఎదుర్కోలు ఉత్సవం జరిపిస్తారు. 27న రామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుండగా,రామదీక్ష ప్రారంభిస్తారు. 27న పట్టాభిషేకం జరపిస్తారు. 29న సదస్యం, 30 తెప్పోత్సవం, చోరోత్సవం, 31న ఊంజల్ సేవ, ఏప్రిల్ 1 వంసతోత్సవం, 2న చక్రతీర్థం ద్వాదశ ప్రదిక్షణలు, ఆరాధనలు శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలుకుతారు.

**ముఖ్యమంత్రి, గవర్నర్ రాక :**

భద్రాద్రిలో అంగరంగవైభవంగా జరిగే శ్రీరామ నవమికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ శివప్రతాప్ శుక్ల రానున్నారు. ఈ మేరకు వారిరువురికి నేడు దేవస్థానం వైదిక సిబ్బంది వేదాశీర్వచనాలు అందించి ఇఓ దామోదరావు ఆధ్వర్యంలో వేడుకలకు రావాల్సిందిగా రాజపత్రాలను అందిస్తారు.

# మహిళా సాధికారత కోసం అంతా కృషి చేయాలి



- పురుషులతో మహిళలు సమానంగా రాణించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా
- గౌతంపూర్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మహిళలు విద్యా, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ప్రగతి గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో గౌతంపూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ సమాజంలో మహిళలకు మరింత గౌరవం పెరగాలని, మహిళల పట్ల వివక్షను రూపుమాపాలని, మహిళలపై లింగ వివక్ష చూపుతున్న హీన సంస్కృతిని పారద్రోలేందుకు కలిసికట్టుగా పోరాడి మహిళా సాదికారతకు సహకరించాలన్నారు. ఏడు సార్లు లోక్‌సభ సభ్యురాలిగా గెలుపొందిన గీతా చటర్జీ లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు రెండింటిలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కోసం చేసిన పోరాటం స్ఫూర్తితో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే వివక్ష రూపుమాప పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. విఓఏ పద్మ, రత్న కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జున రావు, గౌతంపూర్ సర్పంచ్ కళ్యాణి, విద్యానగర్ సర్పంచ్ భూక్యా శాంతి, వసుంధర సుమంగళి షాపింగ్ మాల్ తాటిపల్లి శంకర్ బాబు దంపతులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి , విద్యానగర్ ఎస్‌కేటి జ్యూయలరీ దోసపాటి క్రాంతి, డాక్టర్లు సాగరిక, నేహా తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై గళమెత్తిన క్లైమెంట్

-కార్మికులతో పాటు పలువురు అభినందనలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని ఏఐటియుసి జాతీయ సమితి సభ్యులు, ఖమ్మం నగర సిపిఐ కార్పొరేటర్ బిజి క్లైమెంట్ గళం విప్పారు. గతంలో ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చలేదంటూ బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో క్లైమెంట్ ప్రశ్నించారు. బుధవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్, కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ బిజి క్లైమెంట్ పలు అంశాలపై ప్రశ్నించారు. గత రెండేళ్ల నుంచి 16 మంది కార్మికులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంటామని చెప్పి ఇప్పటి వరకు నియామకం చేసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్, మేయర్, కమిషనర్ గతంలో హామీ ఇచ్చారని ఆ హామీని ఎందుకు నెరవేర్చలేకపోయారంటూ ప్రశ్నించారు. అదేవిధంగా ఎనిమిది నెలల నుండి పెండింగ్‌లో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడుగురు జవాన్లకు వర్కర్స్ శాలరీ ఇస్తున్నారని వారికి కూడా జవాన్ల శాలరీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లైమెంట్ లేవనెత్తిన అంశాలకు సంబంధించి కలెక్టర్, మేయర్, కమిషనర్ వెంటనే స్పందించి 16 మందిని టిఎల్ఎఫ్ పద్ధతిలో రిక్రూట్ చేసుకుంటామని హామీ ఇచ్చి తీర్మానాన్ని ఆమోదింపజేశారు. ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలను కూడా వెంటనే విడుదల చేస్తామని, ఏడుగురు జవాన్లకు కూడా జవాన్ల వేతనాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో వారికి క్లైమెంట్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 16 మంది మున్సిపల్ కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు, జవాన్లు బిజి క్లైమెంట్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల పక్షాన పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు క్లైమెంట్‌కు తోటి కార్పొరేటర్లతో పాటు ప్రజలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉగాది పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

**- ఎంఎల్‌ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. బుధవారం ఆయన భద్రాద్రి ప్రజలకు, నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రకృతి పులకించే ఈ వసంత కాలంలో ప్రారంభమయ్యే శ్రీ పరాభవనామ సం. రాష్ట్ర ప్రజలందరికీ పాడిపంటలతో పాటు సుఖ సంతోషాలను అందించాలని కోరారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్ట సుఖాలను సమానంగా స్వీకరించాలని నేర్పుతుందని, అదే స్ఫూర్తితో నియోజకవర్గాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కరామే పరమావధిగా తాను నిరంతరం శ్రమిస్తానని, తెలంగాణ సంస్కృతి అద్దం పట్టేలా పండుగను జరుపుకోవాలని సూచించారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నలిపేందుకు ప్రణాళికా బద్దంగా ముందుకు వెళ్తున్నట్లు ఆయన వివరించారు.

## పండుగ వేళ ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి : కూనంనేని



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఉగాది, రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని నియోజవర్గ పరిధిలోని దేవాలయాలు, మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఆయన బుధవారం ఫోన్ ద్వారా కార్పొరేషన్, పంచాయితీ రాజ్, విధ్యుత్, పోలీస్ శాఖల అధికారులతో మాట్లాడారు. పండుగ రోజుల్లో భక్తులకు, ముస్లీం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్, పంచాయితీ అధికారులకు సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలంతా పండుగలను సుఖ సంతోషాలతో జరుపుపుకోవాలని, ఈ మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

## సామాన్యుల జీవితాల్లో ఉగాది కొత్త వెలుగులు నింపాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** వచ్చిన నూతన ఏడాది సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రకృతిలో వచ్చే మార్పుల వలె సామాజిక వ్యవస్థలో కూడా సానుకూల మార్పులు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ఆకాంక్షించారు. ఉగాది పండుగను పురస్కరించుకుని బుధవారం ఆయన మాట్లాడారు. ఉగాది పచ్చడిలో షడ్రుచులు జీవితంలోని కష్ట సుఖాలను సమానంగా స్వీకరించాలని నేర్పుతాయని, అదే స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలుగుజాతి గొప్ప సంస్కృతికి, సంప్రదాయాలను ప్రతీ ఒక్కరూ కాపాడుకోవాలని, పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా సోదరభావాన్ని పెంపొదించే విధంగా ఉండాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్లింలకు తోఫా కిట్లు పంపిణి



**ప్రజాపక్షం/కరకగూడెం:** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పండుగ కానుకగా ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ కా తోఫా లను అందజేస్తోంది. ఈ సందర్భంగా బుధవారం కరకగూడెం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో 75 ఈద్ కా తోఫా కిట్లను ముస్లిం సోదర సోదరీమణుల కోసం ముస్లిం పెద్దలకు తహశీల్దార్, వట్టం కాంతయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది కేవలం ఉపవాసాల కాలం మాత్రమే కాదు ఇది శాంతి సేవ సహనం, మానవత్వాన్ని పెంపొందించే పవిత్ర సమయం అని, ఈ నెలలో మనం ఆకలి విలువను తెలుసుకుంటాం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయాలనే మనసును పెంచుకుంటాం అని పేర్కొన్నారు. అలాగే ముందుగా పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోరెవెన్యూ అధికారులు, ముస్లిం పెద్దలు సజ్జాద్ హుస్సేన్, పఠాన్ యాకూబ్, పఠాన్ అక్బర్, అబ్దుల్లా, సలీం, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమల్లో పాలకులు విఫలం




**-ఏఐవైఎఫ్‌ని బలోపేతం చేయాలి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యువతకు ఇచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఉద్యోగాల సాధనకై ఏఐవైఎఫ్ పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మునిగే కోటి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. యువజనోద్యమాలలో కీలక పాత్ర పోషిస్తున్న ఏఐవైఎఫ్‌ను బలోపేతం చేయాలని ఆయన తెలిపారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సిద్దినేని కర్ణకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రాష్ట్రంలోనూ లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చారని అవి కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయి తప్ప అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ, యువతీ, యువకులతో గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి న్యాయం చేయలేక కాలం వెల్లబుచ్చుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో యువత ఓటుతో పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలో కూడా 40 శాతం మాత్రమే యువత ఉందని కానీ మన భారతదేశంలో 60 శాతం యువత ఉందన్నారు. యువశక్తిని వినియోగించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. ఉచిత పథకాలను రద్దు చేసి కేవలం ఉచిత విద్య, వైద్యం, ఎకనామికల్ రిజర్వేషన్‌ను ఇంప్లిమెంటేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మల్లెబోయిన ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు గణపారపు ఉపేందర్, ఉసికల రవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్, జిల్లా ఆఫీస్ బేరర్ చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యశోదలో టిఎల్ఐఎఫ్ పద్ధతిలో శస్త్ర చికిత్సలు




**-వెన్నుముక సమస్యలకు అత్యాధునీక వైద్య సేవలు**
**-డాక్టర్ మధుకిరణ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో వెన్నుముక సమస్యకు అత్యాధునీక విధానంలో టిఎల్ఐఎఫ్ పద్ధతిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు మధుకిరణ్ యార్లగడ్డ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ మధుకిరణ్ యార్లగడ్డ మాట్లాడుతూ ఖమ్మం ప్రాంతానికి చెందిన 55 సంవత్సరాల కందుల సూరమ్మ తీవ్రమైన వెన్నుపూస నొప్పితో యశోద ఆసుపత్రికి వచ్చిందని తెలిపారు. ఆమె ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కానింగ్ చేయగా వెన్నుపూస ముందుకు జారీ నరాలు బలహీనంగా మారాయని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు టిఎల్ఐఎఫ్ (ట్రాన్స్ఫర్నల్ లంబా ఇంటర్ బాడీ ఫిజనల్ సర్జరీ ) ను చేసి జారిన వెన్నుపూసను యథాస్థితికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సర్జరీలో నరాలు డ్యామేజ్ అయ్యే పరిస్థితులు ఏర్పడతాయని కొన్నిసార్లు నరాల్లో ఉండే బలం తగ్గిపోతుందన్నారు. ఆపరేషన్ కంటే ముందే కంప్యూటర్ సహాయంతో ప్లానింగ్ చేసి ఆపరేషన్ సమయంలో నరాలకు హానీ జరగకుండా న్యూరో మానిటరింగ్ వంటి పద్దతుల ద్వారా వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గతంలో విఫలమైన సర్జరీలను సరి చేయడం వెన్నుముకలో పలు చోట్ల ఎముకలను అతికించడం, తీవ్రమైన వెన్నుముక గాయాలు, కణితులు వంటి కేసులను సమర్థవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సింగపూర్ లోని ఎన్‌యుహెచ్‌ఎస్ సహా ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో, స్కోలియోసిస్ సవరణ,మోషన్ ప్రిజర్వింగ్, వెన్నుముక ప్రక్రియలు వంటి వైద్య విధానాలను వెన్నుముక చికిత్సలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెన్నుముకకు సంబంధించిన అన్ని రకాల సమస్యలకు యశోద ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావు, బాలకృష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం వైద్యశిబిరం



**-ప్రతినెల 20 వార్డులో వైద్యశిబిరం**
**-ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**-కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం రాంకీఅండ్ ఎస్‌బిఐ ఫౌండేషన్ మేఘ, మాధురి సౌజన్యంతో ఉచిత మొబైల్ వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరం ద్వారా బిపి, షుగర్, మలేరియా, టైఫాయిండ్, ఈసిజి, మొదలగు వైద్య పరీక్షలను వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ప్రతి నెలో వార్డులో నిర్వహించే వైద్యశిబిరాన్ని వార్డు ప్రజలు వినియోగించుకొని ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలని, వార్డు ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగింది. ప్రజల ఆరోగ్య సమస్యలు ఈ వైద్యశిబిరం ద్వారా తెలుసుకోవచ్చని కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా రాంకీ ఫౌండేషన్‌కు ఆమె కృతజ్ఞలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రాంకీ ఫౌండేషన్ నిర్వాహకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ముస్లిం కుటుంబాలకు కిట్లు పంపిణీ






**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ప్రాథమిక పాఠశాల వద్ద లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా గ్రేట్ విజన్‌క్లబ్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన రంజాన్ తోఫా, కిట్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురలీకృష్ణ రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపాచంద్రకళ మురలీకృష్ణ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా లయన్స్ క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ సందర్భంగా చేయూతను అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ముందుగా ప్రతిఒక్క ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్‌రావు, వుంద్రు శ్యామ్‌బాబు, చింతోజు నాగేశ్వరరావు, జాలా పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ, జాల మహాలక్ష్మి , తేజావత్ నాగేశ్వరరావు, బీక్యా పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ కొత్త మీటర్ ఏర్పాటు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్ మీటర్‌ను వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి కొత్త మీటర్‌ను అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు మాట్లాడి అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్, ఆయా, సిబ్బంది, కౌన్సిలర్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాడిశ రమణయ్య, మిర్యాల శ్రీనివాసరావు, పుప్పాల అనంతరాములు, రాయి హుస్సేన్, ఈలప్రోలు ప్రశాంత్, రాచకొండ సాయి, తోట రమాదేవి, తోట మంజుల,నరేడ్ల రుక్మిణమ్మ, బాడిశ పద్మ, యాకూబ్‌బి, పెరుమాళ్ళ అరుణ, తోట భాగ్యమ్మ, జబ్బా ఉమ్మశ్రీ, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కేశవాపురం గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తాం

**పంచాయతీ సర్పంచ్ ఈదుల మహేష్**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** కేశవాపురం గ్రామపంచాయతీ పిండిప్రోలు నుంచి విడిపోయి నూతన గ్రామపంచాయతీగా ఏర్పడ్డ గ్రామపంచాయతీ గత పాలక వర్గంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని కేశవపురం గ్రామపంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్ ఈదుల మహేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల గ్రామాల్లో చేపట్టవలసిన పనులపై తీసుకొచ్చిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాన్ని అన్ని విధాలుగా పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుందామని ఇప్పటికే గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నామని గ్రామంలో పురవీధులను శుభ్రపరచామని సైడ్ కాలవలను శుభ్రపరుస్తున్నామని కొందరు ఇంటి యజమానులు సహకరించట్లేదని సైడ్ కాలువలను శుభ్రపరిచేందుకు ప్రతి ఒక్కరు గ్రామపంచాయతీ పాలకవర్గానికి సహకరించాలని ఆయన కోరారు. గ్రామంలో చేపట్టవలసిన పనులను ఇప్పటికే గుర్తించామని కొన్ని బజార్లలో సిసి రోడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందని దాంతో పాటు గ్రామంలో సైడ్ కాలవలు మరియు గ్రామంలోని అంతర్గత మాలిక వసతులు కల్పనకు అందరు కృషి చేయాలని వారి కోరారు. పారిశుద్ధ కార్యక్రమాల్లో గ్రామాలను కొందరు ప్రజలు ఆటంకాలు సృష్టిస్తున్నారని నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి అందరూ సహకరిస్తూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి శ్రావణి కోరారు.